క్లుప్తంగా

వాలీబాల్ టోర్నమెంట్ రిఫరీగా రామకృష్ణ ఎంపిక


పీఈటీ రామకృష్ణ

బుట్టాయగూడెం: జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ప్రత్యేక రిఫరీగా మండలంలోని బుట్టాయగూడెంకు చెందిన ఇరపా రామకృష్ణ ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకూ తమిళనాడు రాష్ట్రంలోని కొయ్యంబత్తూర్‌లో ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ఏపీ తరపున ప్రత్యేక రిఫరీగా రామకృష్ణ వ్యవహరించారు. గిరిజన ప్రాంతానికి చెందిన రామకృష్ణ రిఫరీగా ఎంపిక కావడంతో పలువురు అభినందించారు. ప్రస్తుతం రామకృష్ణ జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేటు కళాశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు.

హైందవ శంఖారావం ర్యాలీ


కొయ్యలగూడెంలో హైందవ శంఖారావానికి పిలుపునిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: హైందవ శంఖారావానికి పిలుపునిస్తూ కొయ్యలగూడెం మండలంలో సోమవారం పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. కొయ్యలగూడెంకు చేరుకున్న హైందవ శంఖారావ రథయాత్ర ర్యాలీని బీజేపీ నాయకులు టెంపుల్స్ సెంటర్లో ప్రారంభించారు. అచ్యుతాపురం, రాజవరం, గవరవరం, యర్రంపేట, పొంగుటూరు మీదుగా రథ యాత్ర కొనసాగింది. 2025 జనవరి 5న గన్నవరం సమీపంలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావానికి హిందులందరూ హాజరు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. చిరువూరు ఉషారాణి, సుంకర ప్రసాద్, గొలిశెట్టి వాసు, బొమ్మ బాబు, తవ్వ గోపాల్, టి.దీక్షితులు, జి.మోహన్‌రావు, ఆరేటి ఏసుబాబు, తగరం కిరణ్, మాటూరి రాధాకృష్ణ పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం


విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రమును పురస్కరించుకొని చండీ హోమం ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు అధ్యక్షతన, అర్చకుల పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ సత్యా కిరణ్ ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. మారిశెట్టి రాధాకృష్ణ, దూసనపూడి ఏడుకొండలు పద్మావతి, వేముల కృష్ణారావు, కనకమాలక్ష్మి దంపతులు, కొప్పుల లక్ష్మి తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి శాశ్వత కమిటీ సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్, వందనపు అప్పలరాజు పాల్గొన్నారు. దూసనపూడి ఏడుకొండలు, పద్మావతి దంపతులు ఆర్థిక సాయంతో ప్రసాద వితరణ చేశారు.

న్యాయం చేయాలని ఎంపీడీవోకు వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కుమారి

జంగారెడ్డిగూడెం: ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధిస్తున్నారని, న్యాయం చేయాలని వేగవరానికి చెందిన కనిపెట్టి కుమారి సోమవారం జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేగవరంలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇల్లు ప్రభుత్వ భూమిలో ఉందని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని అధికారులు నోటీసులు ఇచ్చారని తెలిపింది. అయితే 40 ఏళ్లుగా సదరు ఇంటికి విద్యుత్ బిల్లు, ఇంటి పన్ను చెల్లిస్తున్నానని ఆమె తెలియజేసింది. ఈ క్రమంలో కుళాయి కనెక్షన్ తొలగించారన్నారు. ఇల్లు తప్పితే వేరే ఆస్తులు ఏవీ లేవని, వృద్ధాప్యంలో ఉన్న తనకు న్యాయం చేయాలని ఎంపీడీవోను కుమారి కోరింది.

ఆర్థిక సహాయం అందజేత

జంగారెడ్డిగూడెం: ఇటీవల శ్రీనివాసపురానికి చెందిన మెరిపోం గంగరాజు అనారోగ్యంతో మృతి చెందారు. గంగరాజు కుటుంబం ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎస్ఆర్ఐ హరిబాబు వారికి ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం స్థానికులు పోల్నాటి రాజా, పోల్నాటి రాజు చేతుల మీదుగా రూ. 5వేలు గంగరాజు కుటుంబానికి హరిబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తాతారావు, దుర్గారావు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండేరు వాగుపై వంతెన నిర్మాణంలో జాప్యం

- అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం
- ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.5.5 కోట్లు మంజూరు


గుండేరు వాగుపై కుంగి ప్రమాదకరంగా ఉన్న వంతెన

కామవరపుకోట: గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. మండలంలోని కళ్లచెరువు సమీపంలోని గుండేరు వాగుపై వంతెన నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించి సుమారు 10 ఏళ్ల నుంచి నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ ప్రాంత ప్రజలకు చాలాకాలం నుంచి ఆ వాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. లింగపాలెం మండలం ఆశన్నగూడెం సమీపంలో, కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలో రెండు మండలాలను కలుపుతూ సరిహద్దుగా ఉంది. ఆ వంతెనపై వెళ్లటం ప్రమాదకరమని తెలిసిన నిత్యం రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు వాహనాలు, భారీ వాహనాలు, ఈ వంతెన మీదుగానే రాకపోకలు కొనసాగించేవారు. ఈ రెండు మండలాల కాకుండా ఇతర ప్రాంతాల నుంచి మొక్కజొన్న, పామాయిల్, కోకో, నిమ్మ వంటి అనేక రకాల వ్యవసాయ ఉత్పత్తులు ఈ వంతెనపై నుంచి వివిధ ఫ్యాక్టరీలకు, వ్యాపార సంస్థలకు నిత్యం తరలించేవారు. ఇటీవల కురిసిన వర్షాలతో వరదలు వచ్చి వంతెన పూర్తిగా కుంగిపోయింది. దీనితో వాహనదారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెండు మండలాల ప్రజలకు ఇక్కట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణానికి రూ. 5.5 కోట్లు కేటాయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణం గాలికి వదిలేశారు. ఆ వంతెన నిర్మాణం చేపట్టే వరకు బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు కోసం రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి రెండు మండలాల ప్రాంత ప్రజల ఇబ్బంది గమనించి వెంటనే గుండేరు వాగుపై వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



కామవరపుకోట, లింగపాలెం మండలాలకు చెందిన ప్రాంత వాసులు నిత్యం ఈ వంతెన పైనుంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఆ వంతెన కొన్నేళ్లగా శిథిలవస్థకు చేరటంతో ఆయిల్‌పామ్ గెలలు, అరటి, నిమ్మ వంటి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకుని వెళ్లాలంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది.అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి.

– కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్, చింతలపూడి

టెండర్ ప్రక్రియ పూర్తవగానే నిర్మాణ పనులు



గుండెరు వాగుపై వంతెన నిర్మాణానికి, గతంలో రూ.5.5 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియలో ఆగిపోవడంతో మరలా కూటమి ప్రభుత్వం రాగానే రూ.6 కోట్ల నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే, దానితోపాటు వంతెన పక్క నుంచి డైవర్షన్ రోడ్డుకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండింటికీ టెండర్ ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణం చేపడతాం.

– సొంగ సుందర్‌రావు, రోడ్డు, భవనాల శాఖ అధికారి, కామవరపుకోట మండలం

డైవర్షన్ రోడ్డు నిర్మించాలి



మా ప్రాంతం నుంచి వ్యవసాయం, వ్యాపారం కోసం నిత్యం లింగపాలెం మండలం రంగాపురం, ఆసన్నగూడెం, వేములపల్లి ప్రాంతాలకు ఆ వంతెన దాటి వెళుతూ ఉంటాము. ఈ ఏడాది కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. వంతెనపై నుంచి వాహనాలతో వెళ్లాలంటే ప్రమాద భయం వెంటాడుతోంది. అధికారుల స్పందించి వంతెన నిర్మాణం చేపట్టే వరకు డైవర్షన్ రోడ్డు నిర్మించాలి.

– నౌదు వెంకటఅప్పారావు, రైతు, కళ్లచెరువు

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

కామవరపుకోట: మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై చట్టం రీత్యా చర్యలు తీసుకుంటామని తడికలపూడి ఎస్సై పి. చెన్నారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 31వ తేదీ రాత్రి ప్రజలకు ఇబ్బంది కలిగించే ఈవెంట్లు ఎవరైనా నిర్వహిస్తే వారిపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసు శాఖ సూచనలు పాటించాలి


డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే వేడుకలు, సంబరాలు పోలీసు వారి అనుమతులతో, వారు సూచించిన విధంగా జాగ్రత్తలు పాటిస్తూ నిర్వహించుకోవాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, వారికి వాహనాలు ఇస్తే వాటి యజమానులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలకు సైలెన్సర్లు తీసి వాహనాలు నడిపితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు వారి అనుమతి లేకుండా ఏ విధమైన ఈవెంట్లను నిర్వహించరాదని, 31వ తేదీ రాత్రి సమయంలో ఈవెంట్లు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు వారి వద్ద పర్మిషన్ తీసుకోవడంతో పాటు పోలీసు వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏపీ పబ్లిక్ సేఫ్టీ అండ్ ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ 2013 ప్రకారం ఈవెంట్లు నిర్వహించే ప్రదేశాలలో వీడియో రికార్డింగ్ సీసీ కెమెరాలను తప్పనిసరిగా అమర్చాలని తెలిపారు. ఈవెంట్లలో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలను అతివేగంగా, ప్రమాదకరంగా నడపరాదని, కోడిపందేలు, పేకాట వంటి మొదలైన అసాంఘిక కార్యక్రమాలు నిషిద్ధమన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 112కి కాల్ చేయాలని సూచించారు. రాత్రి సమయంలో రోడ్లపై మందు గుండు సామగ్రిని పేల్చరాదని, నూతన సంవత్సర శుభాకాంక్షలు పేరుతో మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు రాత్రి సమయంలో రహదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తారని, ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని డీఎస్పీ సూచించారు.

విద్యార్థుల పారిశ్రామిక సందర్శన


రేచర్ల 11 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

చింతలపూడి : యర్రగుంటపల్లి పొట్టి మాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా రేచర్ల 11 కేవీ సబ్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. సబ్ స్టేషన్ పని చేసే విధానాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పారిశ్రామిక సందర్శనతోనే విద్యార్థుల్లో విజ్ఞానం, ప్రతిభ మెరుగుపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ విస్సంపల్లి బాబూరావు తెలిపారు. విద్యుత్ పరికరాల వినియోగం, విద్యుత్ పొదుపు, రీడింగ్ నమోదు చేసే విధానంపై పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయులు మోహన్ విద్యార్థులకు వివరించారు. వర్షాకాలంలో విద్యుత్ పరికరాలు వినియోగించడం, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అప్పిరెడ్డి రాము, ఒకేషనల్ ట్రెయినర్స్ రుక్మిణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు


ప్రదర్శనలోని ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

లింగపాలెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సృజనాత్మకతను వెలికి తీసేలా సైన్స్‌లోని వివిధ ప్రాజెక్టులను తయారుచేస్తూ సృజనాత్మక కృత్యాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని మండల విద్యాశాఖ అధికారులు కంటా రామారావు, జె.రవీంద్ర తెలిపారు. సింగగూడెం హైస్కూల్లో సోమవారం విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులను ఆకట్టుకునేలా నూతనత్వంతో ఆలోచింపజేసేలా తయారు చేసిన కృత్యాలను ప్రదర్శించారు.ఈ సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన గవర్నమెంట్ హైస్కూల్ బోగోలు, జిల్లా పరిషత్ హైస్కూల్ గోకవరం కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. వీరిని జిల్లాస్థాయిలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనకు పంపిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి సారించాలి


కేఆర్‌పురంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాల కిట్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: యువకులు, విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించాలని ఐటీడీఏ ఏపీఓ పీవీఎస్ నాయుడు సూచించారు. మండలంలోని కోట రామచంద్రాపురం ఐటీడీఏ సమీపంలోని గురుకుల కళాశాల వద్ద సోమవారం ఓఎన్‌జీసీ (రాజమండ్రి) సామాజిక బాధ్యత పథకంలో గిరిజన యువత విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీఓ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి లక్ష్యం ముందుకు సాగాలన్నారు. యువత, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఓఎన్‌జీసీ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ సంబంధించిన పుస్తకాల కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ డీజీఎం సోమ్‌నాథ్, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, స్కిల్ డెవలప్‌మెంట్ నిపుణులు శ్రీనివాసరావు, షేడ్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధీర్ కుమార్, సీఎంసీ (విశాఖపట్నం) సీఈఓ జగదీష్, ఫోర్బ్స్ ఫొటోగ్రాఫర్ వికాశ్ పురేటి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు


మాట్లాడుతున్న కళాశాల మేనేజ్‌మెంట్

దెందులూరు: విద్యాబోధనలో నూతన టెక్నాలజీని అనుసంధానం చేస్తూ అభివృద్ధి చెందుతున్న దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధి వేగవరంలో ఉన్న హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో ఆర్థిక అవకతవకలు జరిగాయని జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని చైర్మన్ ఈవీ రమేష్ తెలిపారు. సోమవారం కాలేజీ ఆవరణలో కార్యదర్శి అట్లూరి శ్రీనివాస్, ట్రెజరర్ ఎం వెంకయ్య, ప్రిన్సిపల్ లావణ్య, ఏవో కరుణానిధితో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల నగదు కాలేజీలో కొంతమంది వాడేసుకున్నారని కొందరు దురుద్దేశ్యంతో అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. మేనేజ్‌మెంట్ మాట్లాడుతూ కాలేజీ ఉన్నతిని, అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రచారం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి


జంగారెడ్డిగూడెంలో వామపక్ష, దళిత సంఘాల నిరసన

జంగారెడ్డిగూడెం: అంబేడ్కర్‌ను అవహేళనగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని వామపక్షాల డిమాండ్ చేశాయి. అమిత్ షా రాజీనామా చేయాలని రాష్ట్రంలో 10 వామపక్ష పార్టీల పిలుపుమేరకు జంగారెడ్డిగూడెం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, రెడ్ స్టార్ తదితర వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ, సీపీఎం మండల కార్యదర్శి మానుకొండ జీవరత్నం, సీపీఐ పట్టణ కార్యదర్శి జంపన రమణ రాజు, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి రామసూరి రెడ్డి, రెడ్ స్టార్ నాయకులు జొన్నకూటి వెంకటేశ్వర్లు, చంద్రన్న వర్గం నాయకుడు ఎస్.సుందరరావు, అడ్వకేట్ తొర్లపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. పార్లమెంట్‌లో రాజ్యాంగంపై నిర్వహించిన చర్చలో అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వెంటనే ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సూర్యారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, డీవైఎఫ్ఐ నాయకులు షేక్ మాబు సుభాని, వంగా గోపి, సీపీఐ నాయకులు కునపాము విష్ణు, కుంచె వసంతరావు, శ్రీను, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు సరియం రామ్మోహన్, ఎం.శ్రీనివాస్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.భూషణం, బి.వినోద్, పీఓడబ్ల్యూ నాయకులు కె.రామలక్ష్మి, ఎం.లక్ష్మి, ఆదివాసి సంఘం రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న, కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా లీగల్ చైర్మన్ బొడ్డు వాసు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి

పోలవరం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడిన కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షాను అన్ని పదవుల నుంచి తొలగించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అమిత్ షా వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలో భాగంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్, సీపీఎం మండల కమిటీ సభ్యులు మడివి చలపతిరావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

బుట్టాయగూడెం: రాజ్యసభలో అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఈ.భూషణం, తెల్లం రామకృష్ణ, తగరం బాబూరావు తదితరులు తొలుత నెహ్రూ సెంటర్‌లో

వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

కుక్కునూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంటు సభలో అవమానపరుస్తూ వ్యాఖ్యానాలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ సోమవారం కుక్కునూరు మండల కేంద్రంలోని సంజయ్ నగర్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మైసాక్షి వెంకటాచారి, సోయం చంద్రరావు, సీపీఎం మండల కార్యదర్శి బియ్యన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష పార్టీల నిరసన

చింతలపూడి: పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చెయ్యాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ రెడ్డి స్టార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్ నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారుర. అంబేడ్కర్‌ను పదిసార్లు స్మరించుకుంటే పుణ్యం రాదని భగవంతుని స్మరించుకుంటే పుణ్యం ప్రాప్తిస్తుందని అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు. పార్లమెంట్ సాక్షిగా అవహేళన చేసిన అమిత్ షా కేంద్ర మంత్రివర్గంలో కొనసాగే అర్హత కోల్పోయారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె గురవయ్య, మండల సహాయ కార్యదర్శి పి సోమశేఖర్, సీపీఎం కన్వీనర్ పి పాండురంగారావు, నాయకులు రామిశెట్టి సత్యనారాయణ, ఎస్ సూర్యకుమార్, వరలక్ష్మి దేవి, కె.అనురాధ, సీపీఐ నాయకులు టి.బాబు, ఎస్‌కే కాలేషా, దొంతా కృష్ణ, రెడ్ స్టార్ జిల్లా నాయకులు డి. రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా కేసుల్లో పలువురి బైండోవర్

పోలవరం రూరల్: నాటుసారా కేసుల్లోని ముద్దాయిలను తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్లు పోలవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పోలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా కేసుల్లో పాత ముద్దాయిలైన 17 మందిని సోమవారం పోలవరం తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

కొయ్యలగూడెం: బెల్ట్ షాపు నిర్వహణ కోసం అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి చంద్రశేఖర్ సోమవారం పేర్కొన్నారు. యర్రంపేట గ్రామానికి చెందిన చాపల నాగేశ్వరరావు 48 క్వార్టర్ మద్యం సీసాలు తరలిస్తున్నాడని సమాచారం అందడంతో అంకాలగూడెం సమీపంలో వాటిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. మద్యం సీసాలు కన్నాపురానికి చెందిన ఒక మద్యం దుకాణంలోనివిగా ప్రచారం సాగుతోంది.

ప్రసంగరాజు మృతికి సంతాపం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంకు చెందిన మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు వెంపా ప్రసంగరాజు సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. తెల్లవారుజామున రక్తపోటు సమస్యతో ప్రసంగరాజు గుండెపోటుకు గురై మృతి చెందినట్లు ఆయన సోదరుడు ఐజక్ తెలిపారు. ప్రసంగరాజు మండల కోఆప్షన్ సభ్యుడిగా పని చేశారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

సరిహద్దు వివాదంలో వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: సరిహద్దు విషయంలో వ్యక్తిని బెదిరించిన నేరంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మైసన్నగూడెంలో మోటమర్రి నాగ నరేంద్రరావుకు గ్రామంలో 3.89 ఎకరాల భూమి ఉంది. భూమికి ఆనుకుని సరిహద్దుదారుడైన పిల్లి నాగరాజు మరో ఇద్దరితో కలిసి 30వ తేదీన కత్తి, పలుగు, పార, ట్రాక్టర్‌ను తీసుకువచ్చి సరిహద్దురాళ్లు, కంచెలు తొలగిస్తున్నాడన్నారు. ఈ క్రమంలో అడ్డుకోబోయిన నరేంద్రరావును అసభ్యపదజాలంతో తిడుతూ ట్రాక్టర్‌తో గుద్ది చంపుతానని బెదిరించాడన్నారు. ఆ మేరకు నరేంద్రరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దౌర్జన్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళపై దౌర్జన్యం చేసిన కేసులో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్‌జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పేరంపేటకు చెందిన ఆడమిల్లి నాగమణి ఇంటి పక్కనే నివాసం ఉంటున్న కండెలి సురేష్ అనే వ్యక్తి అకారణంగా తిరుగుతూ ప్రతి రోజు నాగమణితో గొడవపడుతున్నాడన్నారు. ఈ విషయాన్ని నాగమణి పెద్దల్లో పెట్టడంతో మరింతగా రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నాడని, ఈ క్రమంలో 30వ తేదీ సోమవారం సాయంత్రం సురేష్ మద్యం సేవించి నాగమణి ఇంటికి వచ్చిన ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు దాడి చేశాడన్నారు. చంపుతానని బెదిరించడంతో, నాగమణి ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.